క్లుప్తంగా

రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయండి



పెంట్లవెల్లి: భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో అఖిల భారత ప్రజాతంత్ర రాష్ట్ర మహాసభలను ఈ నెల 21, 22, 23వ తేదీల్లో గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట శుక్రవారం ఐద్వా మహిళా సంఘం విజయవంతం చేయాలని మండలంంలోని ఐద్వా మండల అధ్యక్షురాలు ఆదిలక్ష్మి పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. ముఖ్య అతిథిగా ఐద్వా మహిళా జాతీయ కార్యదర్శి బృందాకరన్, జాతీయ నాయకురాలు పుణ్యావతి హాజరవుతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో లక్ష్మి, రజిత, గోవిందమ్మ, వెంకటమ్మ, పద్మ, చిట్టెమ్మలు పాల్గొన్నారు.

మిత్రుడి కుటుంబానికి చేయూత



చారకొండ: మండలంలోని జూపల్లిలో నెల రోజుల కిందట అనారోగ్యంతో నజీర్ మృతి చెందాడు. గ్రామానికి చెందిన మైనార్టీ మహిళలు, బాల్య మిత్రులు సాజిదా, సాధిక, జరీనా, హాసీనా మరికొంత మంది మహిళలు బాధిత కుటుంబాన్ని గురువారం పరామర్శించారు. మృతుడికి భార్య, ముగ్గురు ఆడపిల్లలు ఉన్నారు. పెద్ద కుమార్తె పేరుమీద రూ.50 వేల ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. అదేవిధంగా రూ. 5 వేల నగదును అందజేశారు.

మెటీరియల్ పంపిణీ



కల్వకుర్తిరూరల్: పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు శుక్రవారం క్లాస్‌మెట్ క్లబ్ ఆధ్వర్యంలో ఎన్‌ఎంఎంఎస్ మెటీరియల్‌ను అందజేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మురళీధర్‌రెడ్డి మాట్లాడుతూ స్కాలర్‌షిప్ కోసం విద్యార్థులకు మెటీరియల్ ఇవ్వడం అభినందనీయమన్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని సేవ కార్యక్రమాలు అందించాలని ఆయన కోరారు.

మాల మహానాడు జిల్లా అధ్యక్షుడిగా పాశం ఉసేన్

నాగర్‌కర్నూల్‌రూరల్: మాల మహానాడు జిల్లా కమిటీని శుక్రవారం మాల మహానాడు పీవీ రావు ఆర్గనైజేషన్ ఫౌండర్ మాల మహానాడు తెలంగాణ జేఏసీ చైర్మన్ చెరుకు రాంచందర్ ఆధ్వర్యంలో శుక్రవారం ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. జిల్లా అధ్యక్షుడిగా పాశం ఉసేన్‌ని నియమించారు. అనంతరం మండల కమిటీలను, గ్రామ కమిటీలను త్వరితగతిన ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు దాసరి చెన్నయ్య, తదితరులు పాల్గొనారు.

నేడు ఆలయ కమిటీ ఎన్నిక

మన్ననూర్: స్థానిక వేణుగోపాల స్వామి ఆలయం కార్యనిర్వాహక కమిటీని ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ ఆదేశాల మేరకు 19వ తేదీ ఉదయం 10 గంటలకు ఆలయం ప్రాంగణంలో కమిటీని ఎన్నుకుంటునట్లు ఉమామహేశ్వర ఆలయం కమిటీ డైరెక్టర్ సంబు శోభ, వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ హన్మంతిరెడ్డి, ఆలయం కమిటీ అధ్యక్షుడు డాక్టర్ సురేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామంలోని అన్ని వర్గాల ప్రజలకు ఆలయ కమిటీలో అవకాశం కల్పిస్తామని పేర్కొన్నారు.

సీపీఎం మహాసభలను విజయవంతం చేయండి

కోడేరు: మండలంలోని రాజాపూర్‌లో శనివారం నిర్వహించనున్న సీపీఎం మహాసభలను విజయవంతం చేయాలని సీపీఎం మండల కార్యదర్శి నర్సింహ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మహాసభలకు కార్యకర్తలు, ప్రజలు అధిక సంఖ్యలో విజయవంతం చేయాలని కోరారు. అనంతరం గ్రామంలో జెండాలు, తోరణాలు కట్టారు.



మహిళల ఆర్థికాభివృద్ధికి తోడ్పాటు



లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

అచ్చంపేట: రాష్ట్ర ప్రభుత్వం మహిళలను కోటీశ్వరులను చేసేందుకు అనేక సంక్షేమ, ఆర్థికాభివృద్ధి పథకాలను తీసుకొచ్చిందని ఎమ్మెల్యే వంశీకృష్ణ అన్నారు. శుక్రవారం అచ్చంపేటలోని అంబేద్కర్ ప్రజాభవన్‌లో కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా కృషి చేస్తున్నట్లు వివరించారు. ఈ పథకం ద్వారా మహిళలకు జిల్లాలో క్యాంటీన్లు, ఈవెంట్ మేనేజ్‌మెంట్ యూనిట్లు, డెయిరీ ఫాం, కోళ్లు, చేపల పెంపకం, మీసేవతోపాటు వివిధ యూనిట్ల స్థాపనకు అవకాశం కల్పిస్తున్నామని చెప్పారు. మహిళా సంఘాల ద్వారా వివిధ వ్యాపారాలను ప్రోత్సహిస్తున్నామని, వడ్డీలేని రుణాలు అందజేస్తున్నామన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళలకు అన్నిరంగాల్లో అవకాశం కల్పిస్తున్నారన్నారు. నియోజకవర్గంలో 241 కల్యాణలక్ష్మి, వంద సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశామన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ చైర్మన్ రాజేందర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి, మాజీ ఎంపీపీ రామనాథం తదితరులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి కృషి

ఉప్పునుంతల: ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే వంశీకృష్ణ గిరిజనులతో కలిసి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేవాలయాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తుందన్నారు. నాయకులు నర్సింహారెడ్డి, అనంతరెడ్డి, నర్సింహారావు, చంద్రమౌళి, చత్రునాయక్, గోవర్ధన్‌రెడ్డి తదితరులు, స్థానిక గిరిజన నాయకులు పాల్గొన్నారు.

అర్హులందరికీ రుణమాఫీ చేయాలి



మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి పర్వతాలు

పెద్దకొత్తపల్లి: ఎలాంటి షరతులు లేకుండా అర్హులందరికీ రూ.2 లక్షల రుణమాఫీ చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పర్వతాలు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో సీపీఎం కార్యకర్తల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. రైతులందరికీ రుణమాఫీ చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు రాయితీలను కల్పించి ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తుందన్నారు. నిత్యవసర వస్తువుల ధరలు రోజురోజుకు పెరిగిపోతున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోకపోవడంతో పేదలు ఇబ్బందులకు గురి అవుతున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్త రేషన్‌కార్డులు, పింఛన్లు, ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని ప్రజలను మభ్యపెడుతూ కాలయాపన చేస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు శ్రీనివాసులు నరసింహ, శివవర్మ, దశరథం, శంకర్, బాలస్వామి, ఎల్లయ్య, శేసమ్మ, చంద్రకళ, రాముడు పాల్గొన్నారు.

సైన్స్ ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేయాలని ధర్నా



పెంట్లవెల్లి: మండలంలోని జటప్రోల్ హైస్కూల్‌లోని సైన్స్ ఉపాధ్యాయుడు వెంకటేశ్వర్లశెట్టిని విధుల నుంచి తొలగించాలని ప్రజా సంఘాల ఆధ్వర్యంలో పాఠశాల ఎదుట ధర్నా నిర్వహించి అనంతరం ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు ఈశ్వర్, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు శేఖర్ మాట్లాడుతూ కొంత కాలంగా జటప్రోల్‌లోని హైస్కూల్‌లో విధులు నిర్వహిస్తున్న సైన్స్ టీచర్ వెంకటేశ్వర్లు స్కూల్‌కు గైర్హజరు అవుతూ వేతనం తీసుకుంటున్నాడని ఆరోపించారు. కార్యక్రమంలో ఈశ్వర్, హనుమంతు, శేఖర్, శ్రీనివాసులు, రవి తదితరులు పాల్గొన్నారు.

వైద్య విద్యార్థినికి ఆర్థికసాయం



వెల్దండ: మండల కేంద్రానికి చెందిన వి. హాసిని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని నిర్మల్ ప్రభుత్వ వైద్యశాలల్లో ఎంబీబీఎస్ సీటు సాధించడంతో శుక్రవారం పాపిశెట్టి రాము విద్యార్థిని శాలువాలతో సన్మానించి రూ.10వేల ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యవిద్యలో ఉన్నతంగా రాణించి అత్యున్నత డాక్టర్‌గా ఎదగాలన్నారు. పేదలకు అండగా ఉండి వైద్య సేవలందించాలన్నారు. కార్యక్రమంలో చల్లా మధుసూదన్‌రెడ్డి, రామకృష్ణ, శ్రీనునాయక్, శ్రీనివాసులు, ప్రభాకర్, రవి తదితరులు ఉన్నారు.

ఎస్‌ఐగా శంషోద్దీన్

చారకొండ: మండల నూతన ఎస్‌ఐగా శంషోద్దీన్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. చారకొండలో పనిచేస్తున్న ఎస్‌ఐ వెంకట్‌రెడ్డి ఉప్పునుంతల మండలానికి బదిలీకాగా, మహబూబ్‌నగర్ ట్రాఫిక్ ఎస్‌ఐగా విధులు నిర్వహిస్తున్న శంషోద్దీన్ బదిలీపై మండల కేంద్రానికి వచ్చారు.

ఉప్పునుంతలలో..

ఉప్పునుంతల: నూతన ఎస్‌ఐగా వెంకట్‌రెడ్డి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన ఎస్‌ఐ లెనిన్ బదిలీపై వెళ్లగా ఆయన స్థానంలో చారకొండ ఎస్‌ఐగా పనిచేసిన వెంకట్‌రెడ్డి బదిలీపై మండలానికి వచ్చారు. శాంతి భద్రతల పరిరక్షణలో ప్రజాప్రతినిధులు, అన్ని పార్టీల నాయకులు, ప్రజలు సహకారం అందించాలని ఎస్‌ఐ కోరారు.

ఏఓకు సన్మానం

లింగాల: మండల వ్యవసాయాధికారిగా శుక్రవారం బాధ్యతలు చేపట్టిన అనిల్‌ను సహ ఉద్యోగులు రైతు వేదికలో సన్మానించారు. రైతుల సమస్యలపై దృష్టి సారించాలని ఏఈఓకు సూచించారు. కార్యక్రమంలో మండలంలోని ఆయా క్లస్టర్ల ఏఈఓలు పాల్గొన్నారు.

ఏఓగా నాగజ్యోతి

కోడేరు: మండల వ్యవసాయాధికారిగా నాగజ్యోతి శుక్రవారం విధుల్లో చేరారు. ఇక్కడ పని చేస్తున్న ఏఓ శ్రీరాం హైదరాబాద్‌కు బదిలీపై వెళ్లారు. నాగజ్యోతి సూర్యాపేట నుంచి బదిలీపై మండల కేంద్రానికి వచ్చారు. ఇక్కడ పని చేస్తున్న ఏఈఓలు బదిలీ కావడంతో వారికి స్థానంలో నూతనంగా వచ్చిన ఏఈఓలు పస్పుల ఏఈఓగా సురేష్‌రెడ్డి, జనుంపల్లికి శ్రావణ్, సింగాయిపల్లికి నవ్యభారతి, శివుడులను సన్మానించారు.

కురిసిన వర్షం.. పంటలకు నష్టం



తెలకపల్లి: మండలంలోనం కొన్ని రోజులుగా వర్షం కురుస్తోంది. ప్రజలు, రైతులు నానా అవస్థలు పడుతున్నారు. రైతులు తమ పొలాల్లో వేసుకున్న పత్తి, ఇతర పంటలు పూర్తిగా నీటిలో మునిగిపోయి నష్టం వాటిల్లింది. వివిధ ప్రాంతాల నుంచి పత్తి చేనులో పత్తిని తీయడానికి కూలీలు ఇబ్బందులు పడ్డారు. పత్తి రైతులను ఆదుకోవాలని పలువురు కోరారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం



బిజినేపల్లి: పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం కలుగుతుందని లట్టుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి ఆలోచన అన్నారు. శుక్రవారం లట్టుపల్లి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో లట్టుపల్లి, గంగారం, మంగనూర్, ఎర్రకుంటతాండలలో ఆరోగ్య కార్యకర్తలు పోడిదినం నిర్వహించారు. ఈ సందర్భంగా డా.ఆలోచన మాట్లాడుతూ వర్షం నీరు, మురుగునీరు నిల్వకుండా చూడాలన్నారు. సిబ్బంది తేజస్విని, యాదగిరి, అబ్దుల్ సలీం, నాగేష్, బొజ్జమ్మ, జ్యోతి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నీటి వృథాను అరికట్టాలి



కోడేరు: మండలంలోని నాగులపల్లి ప్రధాన రహదారి పక్కన తాగునీరు వృథాగా పోతుంది. నల్లాకు ట్యాప్ ఏర్పాటు చేయపోవడంతో నీరంతా రోడ్డుపైకి వచ్చి బురదమయంగా మారుతుందని అన్నారు. అధికారులు స్పందించి నీటి వృథాను అరికట్టాలని కోరుతున్నారు.

మహిళ కుటుంబానికి సాయం



మన్ననూర్: స్థానిక అంబేడ్కర్ కాలనీకి చెందిన వికలాంగురాలు మహిళ అంజలి కుటుంబాన్ని అచ్చంపేట పట్టణానికి చెందిన సాదె రాజు శుక్రవారం పరామర్శించారు. 25 కేజీల సన్న బియ్యంతో పాటూ ఆమె కూతురుకు రెండు జతల చొప్పున కొత్త దుస్తులు అందజేశారు. ఈ సందర్భంగా దాత సాదె రాజు మాట్లాడుతూ చిన్నారిని దత్తతగా తీసుకుని భవిష్యత్తులో ఇంటర్మీడియట్ వరకు ఖర్చులు భరిస్తామని భరోసా ఇచ్చారు.

మాజీ ఎమ్మెల్యేకు ఘన నివాళి



కొల్లాపూర్: పట్టణంలోని శ్రీవాణి విద్యానిలయంలో మాజీ ఎమ్మెల్యే వెంకటేశ్వర్‌రావు 22వ వర్ధంతిని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా టీపీసీసీ నాయకులు రంగినేని జగదీశ్వరుడు హాజరై మాజీ ఎమ్మెల్యే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. చిన్నారులకు నోట్‌పుస్తకాలు, పెన్నులు, మహిళలకు చీరలు పంపిణీ చేశారు. అనంతరం రంగినేని జగదీశ్వరుడు మాట్లాడుతూ మూడు సార్లు వరుసగా ఎమ్మెల్యేగా గెలిచిన వెంకటేశ్వర్‌రావు గెలుపొంది కొల్లాపూర్ పట్టణానికి కృష్ణానది నుంచి పైప్‌లైన్ల ద్వారా తాగునీటిని అందించారని కొనియాడారు. రిటైర్డ్ హెచ్‌ఎం పాపల్‌రావు, న్యాయవాది మధుసూదన్‌రావు, జమీల్‌అహ్మద్‌ఖాన్, వెంకటస్వామి, జుబేర్‌ఖాన్, చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.

పశువులకు గాలికుంటు నివారణ వ్యాధి టీకాలు

పెద్దకొత్తపల్లి: మండలంలోని దేవల్‌తిరుమలాపూర్‌లో శుక్రవారం పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసినట్లు వెటర్నరీ అసిస్టెంట్ శైలజ తెలిపారు. గ్రామాల్లో ఉన్న పాడిపశువులకు టీకాలు వేయించాలని పాడిరైతులను కోరారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది యాదగిరి పాల్గొన్నారు.

ఉప్పునుంతల: పశువులు, గేదెలకు గాలికుంటు వ్యాధి సోకకుండ టీకాలు వేయించాలని పశువైద్యాధికారిణి దీప్తి కోరారు. శుక్రవారం మండలంలోని జప్తీసదగోడులో పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 152 పశువులకు, 105 గేదెలకు టీకాలు వేశారు. కార్యక్రమంలో జేవీఓ కమల, వీఏ బాలకోటి, సిబ్బంది మీరాజ్, హబీబ్, గోపాలమిత్రలు అంజయ్య, నాగరాజు పాల్గొన్నారు.

కలుపు నివారణ యంత్రాలు వితరణ



మన్ననూర్: అమ్రాబాద్ మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన రైతులకు కలుపు తీసే యంత్రాలను ఐసీఐసీఐ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో శనివారం రైతు వేదిక ప్రాంగణంలో ఉచితంగా పంపిణీ చేశారు. రైతులు తమ పంట పొలాల్లో సులభంగా కలుపు నివారణ చేసుకోవడం కోసం ఈ యంత్రాలు ఎంతగానో ఉపయోగకరంగా ఉంటాయని ఐసీఐసీఐ ఫౌండేషన్ డీఓ గంగాధర్ రావు, రూరల్ లైలీవుడ్ పాట్నర్ గంధం అంతయ్య తెలిపారు. ఈ యంత్రం కలుపు తీయడంతో పాటూ మొక్కలకు జవసత్వువలు తీసుకువచ్చే విధంగా భూమిని సులభతరం(దున్నడం) చేస్తూ వన్ బై టూ పరికరంగా ఉపయోగపడుతుందన్నారు. రైతులు ఫౌండేస్ ఇస్తున్న సహకారాన్ని పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకొని అభివృద్ధి చెందాలని అన్నారు. చిన్న సన్నకారు రైతులతో పాటూ పేదలకు సుమారు 150 మందికి పరికరాలు అందజేశామన్నారు. ఏఈఓ సీతారాం, వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

రెండు కార్లు ఢీ: తప్పిన ప్రమాదం

వెల్దండ: మండల కేంద్రంలోని హైదరాబాదు–శ్రీశైలం జాతీయ రహదారిపై ఏవీఆర్ ఫంక్షన్‌హాల్ వద్ద శుక్రవారం రెండుకార్లు ఎదురెదురుగా ఢీకొన్నాయి. వంగూరు మండలం చౌదర్‌పల్లి గ్రామానికి చెందిన కృష్ణారెడ్డి కుటుంబ సభ్యులతో హైదరాబాద్ వెళ్తున్నారు. అచ్చంపేటకు చెందిన శంకర్ హైదరాబాద్ నుంచి అచ్చంపేటకు వెళ్తున్నారు. మార్గమధ్యలో వెల్దండ సమీపంలో ఎదురెదురుగా వారి కార్లు ఢీకొన్నాయి. కృష్ణారెడ్డికి సంబంధించిన కారు అదుపు తప్పి చెట్టుకు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కృష్ణారెడ్డి భార్యకు స్వల్ప గాయాలయ్యాయి. వెల్దండ పోలీస్‌స్టేషన్‌లో బాధితులు ఫిర్యాదు చేశారు.

స్వచ్ఛ భారత్‌లో భాగస్వాములవుదాం



కిట్ అందిస్తున్న మున్సిపల్ చైర్మన్ ఎడ్మసత్యం

కల్వకుర్తిరూరల్: స్వచ్ఛ భారత్‌లో భాగస్వాములవుదామని మున్సిపల్ చైర్మన్ ఎడ్మసత్యం కోరారు. శుక్రవారం పట్టణంలోని శిశుమందిర్ పాఠశాలలో విద్యార్థులు స్వచ్ఛ భారత్ కిట్లను పంపిణీ చేశారు. స్వామి వివేకానంద సేవా బృందం జిల్లా యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో పాఠశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎడ్మసత్యం మాట్లాడుతూ మున్సిపాలిటీలోని ప్రతి ఒక్కరు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. తడి పొడి చెత్తపై అవగాహన కల్పించారు. శివకుమార్, ఆంజనేయులు, రాజు, హర్షిత్, చింటు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీకి వినతి



కల్వకుర్తిరూరల్: అతిథి అధ్యాపకుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం ఎమ్మెల్సీ కోదండరాంకు ఆసంఘం రాష్ట్ర నాయకుడు సదానందంగౌడ్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఐదు నెలలుగా జీతాలు రావడం లేదని వివరించారు. రాష్ట్రంలో 1654 మంది అతిథి అధ్యాపకులు ఉండగా నాగర్‌కర్నూల్ జిల్లాలో 73 మంది, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో 242 మంది గెస్ట్ లెక్చరర్‌లు ఉన్నారని ఎమ్మెల్సీ దృష్టికి తీసుకెళ్లారు.

శుద్ధమైన తాగునీటిని అందిస్తాం

తాడూరు: శుద్ధమైన తాగునీటిని అందిస్తామని మిషన్ భగీరథ అధికారులు శివకుమార్, శ్రీధర్‌రావులు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని రైతువేదిక ఆవరణలో శుక్రవారం ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. సింగిల్ ఫేజ్, త్రీ ఫేజ్ మోటర్ నిర్వహణలో ఎదురయ్యే సమస్యలు వాటిని మరమ్మతు చేయడానికి సంబంధించిన విషయాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సహాయకులు, ఎంపీడీఓ జ్యోతిపరోసియా పాల్గొన్నారు.

కరపత్రాలు విడుదల



అచ్చంపేట రూరల్: జిల్లా కేంద్రంలో ఈనెల 27న నిర్వహించే మాలల ఆత్మగౌరవ సభను విజయవంతం చేద్దాలమని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట కమిటీ అధ్యక్షుడు పాత్కుల శ్రీశైలం కోరారు. శుక్రవారం మండలంలోని సిద్దాపూర్, బొమ్మనపల్లిలో ఆయన కరపత్రాలు విడుదల చేశారు. కార్యక్రమంలో నాయకులు దివాకర్, ఆనంద్, నరహరి, ప్రవీణ్, విజయ్, సైదులు, రామకృష్ణ పాల్గొన్నారు.

పత్తికి గిట్టుబాటు ధర కల్పించాలి

తాడూరు: పత్తికి గిట్టుబాటు ధర కల్పించాలని బీఎంపీ పార్లమెంట్ ఇన్‌చార్జ్ విజయ్ డిమాండ్ చేశారు. మండలంలోని సిర్సవాడ, ఐతోల్, ఇంద్రకల్ గ్రామాల్లోని పంటలను శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా రైతులను కలిసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వర్షాల కారణంగా పత్తి తడిసి దెబ్బతినడంతో పత్తి దిగుబడి బాగా తగ్గిందని వాపోయారు. క్వింటాల్‌కు రూ.7 వేలకు గాను రూ.5వేల లోపు కొనుగోలు చేస్తున్నారరని వివరించారు. అధికారులు స్పందించి పత్తికి గిట్టుబాటు ధర కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఎంపీ నాయకులు నరేందర్, శేఖర్, ఓంప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధం

తెలకపల్లి: ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధమని మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు పాశం హుస్సేన్ అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం మాలమహానాడు సమావేశం నిర్వహించారు. మాల జేఏసీ మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా పాశం హుస్సేన్ మాట్లాడుతూ మాలల హక్కుల సాధన కోసం ప్రతి ఒక్కరు సైనికుల్లా పనిచేయాలని కోరారు. రాజకీయ పార్టీలు చేస్తున్న కుట్రలను తిప్పి కొట్టాలని కోరారు. మండల అధ్యక్షుడిగా దాసరి చెన్నయ్య, మండల కమిటీ నాయకులుగా తుమ్మ రామకృష్ణ, తుమ్మ నర్సింహ, కురుమయ్య, బొందయ్య, మల్లేష్, శివ తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

రోటవేటర్‌లో కాలు ఇరుక్కొని తీవ్రగాయాలు

వెల్దండ: మండలంలోని పోషమ్మగడ్డతండాకు చెందిన వద్యావత్ పవన్ ప్రమాదవశాత్తు రోటవేటర్‌లో కాలు ఇరుక్కొన్ని తీవ్రగాయలైన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. తండావాసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం తండాలో వ్యవసాయ పొలంలో వేరుశనగ పంటకోసం రోటవేటర్ సహాయంలో పొలాన్ని చదును చేస్తున్నాడు. రోటవేటర్ మరమ్మతుకు గురికావడంతో పనుల చేస్తుండగా రోటవేటర్‌లో కాలు ఇరుక్కొని కాలుకు తీవ్ర గాయలయ్యాయి. చికిత్స నిమిత్తం వెల్దండలో యెన్నమ్స్ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్



అచ్చంపేట రూరల్: క్రీడలతో ఉజ్వల భవిష్యత్ ఉంటుందని వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, ఎక్సలెంట్ గ్రామర్ స్కూల్ చైర్మన్ సీఎం రెడ్డి అన్నారు. శుక్రవారం విద్యార్థులకు స్పోర్ట్స్ టీషర్టులను పంపిణీ చేశారు. నల్లమల ప్రాంతంలోని విద్యార్థులు క్రీడారంగంలో రాణించడం సంతోషకరమన్నారు. చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ మన్సూర్‌ఖాన్, వ్యాయమ ఉపాధ్యాయులు రాజేందర్, సైదులు పాల్గొన్నారు.

ఇరువర్గాలపై కేసు నమోదు

బల్మూర్: వర్షం నీరు ఇంటి ఎదురుగా నిలుస్తుందని దాయదులు పరస్పరం దాడులు చేసుకున్న ఘటనలో ఇరువర్గాలపై కేసులు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ ప్రేమ్‌నాయక్ తెలిపారు. మండలంలోని గట్టుతుమ్మెన్ గ్రామానికి చెందిన భార్యభర్తలు సరస్వతి, శ్రీనయ్యలు అదేవిధంగా దాయదులు వెంకటయ్య, నారమ్మతో పాటు వారి కూతురు, అల్లుడు గురువారం రాత్రి ఇరువర్గాలు ఒకరిపై ఒకరు దాడులు చేస్తుకున్నారు. ఈ దాడుల్లో ఇరువర్గాలకు చెందిన సరస్వతి, వెంకటయ్యల తలలకు గాయలు కాగా వారి ఫిర్యాదుల మేరకు ఆరుగురిపై శుక్రవారం కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.

డ్రంకెన్‌డ్రైవ్‌లో ఒకరికి జైలు

కల్వకుర్తి టౌన్: మద్యం తాగి వాహనాన్ని నడిపిన వ్యక్తికి జరిమానాతో పాటుగా జైలుశిక్ష విధించిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ మాధవరెడ్డి తెలిపిన వివరాలిలా పట్టణంలోని సభాష్‌నగర్ కాలనీకి చెందిన మహ్మద్ అశ్రఫ్ రెండు రోజుల కిందట పట్టణంలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలలో పట్టుబడ్డాడు. పట్టుబడిన వ్యక్తిని శుక్రవారం కోర్టులో హాజరుపరచగా జడ్జి కావ్య అతనికి రూ.500 జరిమానాతో పాటుగా, రెండు రోజుల జైలుశిక్ష విధించారని ఎస్‌ఐ తెలిపారు.

పంచలింగాల ఆలయ పునర్నిర్మాణం



అచ్చంపేట రూరల్: శ్రీశైల ఉత్తర ముఖద్వారమైన ఉమామహేశ్వర ఆలయ దిగువన ఉన్న భోగమహేశ్వరంలో పంచలింగాల ఆలయ పునర్నిర్మాణ పనులను వేగవంతం చేస్తామని ఆలయ కమిటీ చైర్మన్ బీరం మాధవరెడ్డి అన్నారు. శుక్రవారం దేవాదాయశాఖ అసిస్టెంట్ ఇంజనీర్ బాలయ్య, ఈఓ శ్రీనివాసులుతో కలిసి పూర్తి చేయాల్సిన పనులను అంచనా వేశారు. అభివృద్ధి పనులు చేపట్టాల్సిన పంచలింగాల ఆలయంతో పాటు, మండపం, ప్రహరీ, అలాగే ఆంజనేయస్వామి దేవాలయం వద్ద పరిశీలించారు. దేవాదాయశాఖ నుంచి పూర్తి స్థాయిలో అనుమతులు, నిధులు రాగానే పనులు పూర్తి చేస్తామన్నారు. ఆలయ కమిటీ సభ్యులు పవన్, వినోద్, ఆలయ ప్రధాన అర్చకుడు వీరయ్యశాస్త్రి, లచ్చునాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

యువతి అదృశ్యం: కేసు నమోదు

బల్మూర్: యువతి అదృశ్యమైన ఘటనపై శుక్రవారం కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ ప్రేమ్‌నాయక్ తెలిపారు. మండలంలోని గట్టుతుమ్మెన్ గ్రామానికి చెందిన 21 ఏళ్ల యువతి గురువారం రాత్రి ఎప్పటిలాగే కుటుంబసభ్యులతో కలిసి నిద్రించింది. అర్ధరాత్రి తర్వాత యువతి కనిపించకపోవడంతో కుటుంబసభ్యులు బంధువులు, తెలిసిన వారి ఇళ్లో వెతికినా ఆచూకీ తెలువలేదు. దీంతో గ్రామానికి చెందిన నాగరాజ్ అనే యువకుడిపై అనుమానం వ్యక్తం చేస్తు యువతి తల్లి అలివేల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

మహిళ అదృశ్యం: కేసు నమోదు

నాగర్‌కర్నూల్ క్రైం: మహిళా అదృశ్యంపై శుక్రవారం కేసు నమోదైనట్లు ఎస్‌ఐ గోవర్ధన్ తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం మున్సిపాలిటీ పరిధిలోని దేశిటిక్యాల గ్రామానికి చెందిన రజిత ఎవరికి చెప్పకుండా ఇంటి నుంచి వెళ్లింది. కుటుంబసభ్యులు చుట్టుపక్కల ఎంత వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. మహిళ భర్త విష్ణు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఈవ్ టీజింగ్‌కేసులో జైలుశిక్ష

బిజినేపల్లి: మండలంలోని వెల్గొండ గ్రామానికి చెందిన శివకోటికి ఈవ్ టీజింగ్ కేసులో మూడు రోజుల జైలు శిక్ష, రూ.500 జరిమానా విధిస్తూ శుక్రవారం 2క్లాస్ కోర్టు న్యాయమూర్తి రామయ్య తీర్పు వెల్లడించారు. జేసీబీ డ్రైవర్‌గా పని చేస్తున్న శివకోటి కొద్ది రోజుల కిందట ఒక మహిళతో ఫోన్‌లో టీజ్ చేయడంతో కేసు నమోదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి కోర్టులో నిందితుడిని హాజరుపర్చినట్లు పోలీసులు తెలిపారు.